
నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, సోమవారం 3 ఫిబ్రవరి 2025 | JANAGAON

## పైసలిస్తేనే ప్రాక్టికల్ పరీక్షలు పాస్?

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొన్ని ప్రైవేట్ కళాశాలల వసూళ్ల దందా
- ఒక్కో విద్యార్థి నుంచి రూ. 5 వేలు దండుకున్న వైనం..

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పైసలిస్తేనే పాస్, లేకుంటే ఫెయిల్ అవుతారని, విద్యార్థులను బెదిరిస్తూ కొన్ని ప్రైవేట్ ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు డబ్బులు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. జనవరి 29వ తేదీన నిర్వహించిన నైతిక మానవ విలువలు, 30న నిర్వహించిన పర్యావరణ విద్య, జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షలకు కూడా ఒక్కో విద్యార్థి నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. ప్రాక్టికల్ పరీక్షలకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.5 వేలు వసూలు చేసినట్లు పేరు చెప్పేందుకు భయపడిన పలువురు విద్యార్థులు తెలిపారు. పైసలు లేవని, ఆర్థికంగా కట్టలేని స్థితిలో ఉన్నామని కళాశాలల యాజమాన్యాలను కోరితే, ప్రాక్టికల్ పరీక్షలకు వచ్చే ఎక్స్‌టర్నల్స్‌కు ఇవ్వాలని, లేకుంటే ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ చేస్తారని చెబుతున్నారని వారు వాపోతున్నారు. అక్రమంగా విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఇంటర్ కళాశాలలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.


తొర్రూరులో వంద పడకల ఆస్పత్రి కోసం ఎర్రబెల్లి దయాకర్‌రావు కేటాయించిన భూమి

# ఎల్ఆర్ఎస్‌కు శిఖం భూములు

ప్రభుత్వ, సీలింగ్ భూముల హస్తగతానికి స్కెచ్

- 1231 దరఖాస్తుల తిరస్కరణ.. ఇరిగేషన్ శాఖ పరిశీలనలో 3279 అప్లికేషన్లు
- 1214 అర్జీలకు క్లియరెన్స్.. 7098 పెండింగ్
- రెగ్యులరైజ్‌కు 60 ఇల్లీగల్ వెంచర్లు
- డబ్బులు చెల్లించినవారు 71 మందే..


భూపాలపల్లిలో ఈ శిఖం భూములకే వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): ల్యాండ్ రెగ్యులరైజ్ స్కీం (ఎల్ఆర్ఎస్)లో చెరువు శిఖం, ప్రభుత్వ, సీలింగ్ భూములకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇప్పటికే పలు శిఖం భూములను చాలా మంది రెగ్యులరైజ్ చేసుకోగా ప్రస్తుతం మళ్లీ అదే క్రమంలో అర్జీలు వచ్చాయి. ఎల్ఆర్ఎస్‌తో ప్రభుత్వ భూములను హస్తగతం చేసుకునేందుకు అక్రమార్కులు స్కెచ్ వేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు మొత్తం 8312 దరఖాస్తులు రాగా, ప్రభుత్వ, సీలింగ్, చెరువు శిఖం భూములకు వచ్చిన 1231 అర్జీలను అధికారులు తిరస్కరించారు. అలాగే ఇరిగేషన్ శాఖ పరిశీలనలో 3279 దరఖాస్తులు ఉన్నాయి. మొత్తం 1214 దరఖాస్తులు మాత్రమే అప్రూవల్ కాగా, 71 మంది మాత్రమే డబ్బులు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారు. 2020లో ఎల్ఆర్ఎస్ కింద తమ భూములను రెగ్యులరైజ్ చేసుకునేందుకు 8312 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారికి సంబంధిత అధికారులు ఫోన్ చేసి డబ్బులు కట్టాలని వేడుకుంటున్నా రెస్పాన్స్ రాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. భూపాలపల్లి, కాటారం, గణపురం మండలాల నుంచి అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తూ ఫోన్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు డబ్బులు చెల్లించేందుకు ఎవరూ ఆసక్తి కనబరచడం లేదు. కాగా జిల్లాలో 60 ఇల్లీగల్ వెంచర్ల యజమాను లు ఎల్ ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని చేతులు ముడుచుకుని కూర్చున్నారు.

### జిల్లాలో 8312 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 8312 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో 3771, భూపాలపల్లి మండలంలో 191, చిట్యాలలో 23, గణపురంలో 1573, కాటారంలో 2196, మహాదేవపూర్‌లో 332, మల్హర్‌లో 115, మహాముత్తారంలో 15, టేకుమట్లలో 14, రేగొండ మండలంలో 75 దరఖాస్తులు వచ్చాయి. కాగా జిల్లాలోని 10 మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులు ఇంకా పరిశీలన దశలోనే ఉండగా, కేవలం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో మాత్రమే 1214 దరఖాస్తులు అప్రూవ్ అయ్యాయి. ఎల్ఆర్ఎస్ దరఖా స్తులను పరిశీలించేందుకు మండలానికి ఒక టీంను ఏర్పాటు చేశారు. ఇందులో ఆయా డిపార్ట్‌మెంట్ల నుంచి నలుగురు సభ్యులు ఉంటారు. లెవల్ 1, లెవల్ 2 వెరిఫికేషన్ తర్వాత ఫైనల్ చేస్తారు. 3925 దరఖాస్తులు లెవల్ 1 దశలో, 1712 లెవల్ 2 దశలో ఉన్నాయి. దరఖాస్తుదారులు డాక్యుమెంట్ వ్యాల్యూపై 14 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇల్లీగల్ ప్లాటింగ్ చేసిన వెంచర్ల యజమానులు గ్రీన్‌ల్యాండ్ చార్జెస్ 14 శాతం, డెవలప్‌మెంట్ చార్జీలు గజానికి రూ.100 చెల్లించాలి. 60 ఇల్లీగల్ వెంచర్ల వ్యాపారులు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

### శిఖం భూములకు దరఖాస్తులు

జిల్లాలోని చెరువు శిఖం భూములకు పెద్ద ఎత్తున ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా అధికారులు పరిశీలిస్తున్నారు. భూపాలపల్లి మండలం నుంచి 3, గణపురం 71, కాటారం 194, మహదేవపూర్ 37, మల్హర్ 2, మహాముత్తారం 1, రేగొండ మండలం నుంచి ఒకటి, మున్సిపాలిటీ పరిధిలో 922 దరఖాస్తులను ఇప్పటి వరకు అధికారులు తిరస్కరించారు. భూపాలపల్లి పట్టణంలోని తుమ్మలచెరువు, గోరంట్లకుంట శిఖం భూముల నుంచి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు వచ్చాయి. వాటిని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.




## మడిపెల్లిలో వద్దు

వంద పడకల దవాఖానను తొర్రూరులోనే నిర్మించాలి

- ఎర్రబెల్లి హయాంలో నిర్మాణానికి ప్రతిపాదనలు
- రూ.36 కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం
- దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు


మడిపెల్లిలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి కేటాయించిన భూమి

తొర్రూరు ఫిబ్రవరి 2: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొర్రూరు పట్టణానికి మంజూరు చేసిన వంద పడకల ప్రభుత్వ దవాఖాన నిర్మాణంపై వివాదం నెలకొన్నది. తొర్రూరులో నిర్మించాలని స్థానికులు కోరుతుండగా, స్థానిక పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి మాత్రం మడిపెల్లి గ్రామ సమీపంలో సర్వేనంబర్ 521 సుమారు 5 ఎకరాల భూమిలో నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి అనుబంధంగా ప్రభుత్వ దవాఖానను ఏర్పాటు చేస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అత్యవసర సేవలు త్వరగా అందుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఆస్పత్రిని మారుమూల ప్రాంతానికి తరలించడంపై స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తొర్రూరు పట్టణంలోనే వంద పడకల దవాఖాన నిర్మించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు. కాగా, తొర్రూరు పట్టణంలో వంద పడకల దవాఖాన నిర్మాణానికి గతంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భూమిపూజ చేశారు. ఆస్పత్రి నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.36 కోట్లు మంజూరు చేసింది. అన్నారం రోడ్డులో ఉన్న దేవుడి మాన్యం భూమిలో దవాఖాన నిర్మాణానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక శ్రద్ధ చూపారు. దేవాదాయశాఖతో చర్చలు జరిపి సుమారు 6 ఎకరాల భూమిని ఆస్పత్రి కోసం అందుబాటులోకి తెచ్చారు.

### అడవిలోకి తరలించొద్దు

తొర్రూరు పట్టణంలోనే వంద 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే యశ్వసినీరెడ్డిని డిమాండ్ చేస్తున్నాం. ప్రజా నివాసాలకు సమీపంలోనే దవాఖానలు ఉంటే చిన్నపిల్లలు, వృద్ధులకు అత్యవసర చికిత్సలు సత్వరమే అందుతాయి. అనవసరంగా ఎక్కడో అడవిలోకి తరలించొద్దు. తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తుదినిర్ణయం తీసుకోవాలి. లేకుంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేస్తాం.

– మంగళపల్లి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ

## మా డబ్బులు ఇవ్వండి..

- భవితశ్రీ చిట్‌ఫండ్ బాధితుల ఆందోళన
- సంస్థ ఎండీ ఇంటి ఎదుట నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న భవితశ్రీ చిట్‌ఫండ్ బాధితులు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 2 : రెండేళ్ల నుంచి తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా, మభ్యపెడుతూ, మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పలువురు భవితశ్రీ చిట్‌ఫండ్ బాధితులు ఆదివారం వరంగల్ బ్యాంకు కాలనీలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు కీర్తిమోహన్ మాట్లాడుతూ.. 2018లో రూ.10 లక్షలు, రూ. 5 లక్షలు, రూ. 3 లక్షలు, రూ. 2 లక్షలకు చిట్టీలు వేస్తే, 2022లో పూర్తయినా ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వడం లేదన్నారు. ఆర్థికంగా నష్టపోతున్న తాము విసిగిపోయి నిరాహార దీక్ష చేస్తున్నామని, సోమవారం కూడా కొనసాగిస్తామన్నారు. అధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. దీక్షలో మోహన్‌తో పాటు వరంగల్, నర్సంపేట, యాదాద్రి భువనగిరికి చెందిన బాధితులు శోభ, శ్యాంసుందర్, మహేందర్, వెంకటేశ్, వెంకటలక్ష్మి, శివప్రసాద్ పాల్గొన్నారు.


డోర్నకల్: మున్నేరు వాగు ఎండిపోవడంతో తేలిన రాళ్లు

## నేటి నుంచి ఎమ్మెల్సీ నామినేషన్లు

- వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియ షురూ
- 10 వరకు నల్లగొండలో నామినేషన్ల స్వీకరణ.. 27న ఎన్నికలు
- 12 జిల్లాల్లో 24,905 మంది ఉపాధ్యాయ ఓటర్లు

నల్లగొండ, ఫిబ్రవరి 2 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. వచ్చే నెల 29తో ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం పూర్తి కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గత నెల 29న షెడ్యూల్ విడుదల చేయగా, నేడు నోటిఫికేషన్ జారీ చేయనుంది. నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తూ ఈ నెల 10 వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలోని అభ్యర్థులు నల్లగొండలో నామినేషన్లు వేయనున్నారు. ఈ నెల 11న స్క్రూటినీ, 13న ఉపసంహరణ, అనంతరం 27న పోలింగ్ నిర్వహించి, మార్చి 3న ఫలితాలను లెక్కించనున్నారు. దీనికి సంబంధించి ఎన్నికల యంత్రాంగం జిల్లాలో 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, ఆయా పోలింగ్ కేంద్రాల్లో 24,905 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు ను వినియోగించుకోనున్నారు.

***నల్లగొండలోనే ఓట్ల లెక్కింపు..***

నల్లగొండ ఆర్జాలబావిలోని గిడ్డంగుల సంస్థ గోదాములో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ – ఖమ్మం–నల్లగొండ జిల్లాల్లో మొత్తం 12 జిల్లాలుండగా నల్లగొండ కలెక్టర్ ఆర్వోగా, ఇతర జిల్లాల కలెక్టర్లు ఏఆర్వోలుగా వ్యవహరించనున్నారు. మొత్తం 24,905 మంది ఉపాధ్యాయులుండగా, నల్లగొండలో 4,483, సూర్యాపేటలో 2,637, యాదాద్రిలో 921, సిద్దిపేటలో 163, జనగామలో 921, హనుమకొండలో 5,098, వరంగల్‌లో 2,225, మహబూబాబాద్‌లో 1,618, భూపాలపల్లిలో 323, ములుగులో 612, భద్రాద్రిలో 1,949, ఖమ్మంలో 3,955 మంది ఉన్నారు.


నర్సింహులపేట: ముంగిమడుగు శివారులో తెగిపోయిన చెక్‌డ్యాం, (ఇన్‌సెట్) నీరు లేక బీడుగా మారిన వరి పంట పొలాలు



## ఎండిన వాగులు.. బీడుగా పొలాలు

దిక్కుతోచని స్థితిలో ఆకేరు, మున్నేరు సమీప రైతులు

నర్సింహులపేట/డోర్నకల్, ఫిబ్రవరి 2: ఎండిన వాగులతో పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. దీంతో ఆకేరు, మున్నేరు వాగు పరీవాహక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నర్సింహులపేటలో భారీ వర్షాలతో చెక్‌డ్యాం తెగిపోవడంతో వాగులో చుక్క నీరు లేదు. దీంతో రబీ సాగు చేస్తున్న అన్నదాతలకు నిరాశ తప్పడం లేదు. ఓవైపు ఆకేరు వాగులో చుక్కనీరు లేక పోవడం, వాగును నమ్ముకుని యాసంగి వరి సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఎస్సారెస్పీ నీరు కాల్వ తడిసే వరకే నీరు వస్తుండడంతో చెరువులు, కుంటలు, వాగులోకి నీరు వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు చిన్నగూడూరు అనకట్ట తెగిపోవడం, ఇటు ముంగిముడుగు శివారులో ఆకేరు వాగుపై నిర్మాణం చేసిన చెక్‌డ్యాం తెగిపోవడంతో వాగు ఎండిపోయింది. దీన్ని అసరగా చేసుకొని ఇసుక అక్రమ రవాణ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాగులో నీరు లేకపోవడంతో యాసంగి వరి సాగు చేయలేక ముంగిమడుగు, ఫకీర తండా శివారులో వరి సాగు చేయకుండా వదిలేశారు. అదేవిధంగా డోర్నకల్ శివారులో ప్రవహిస్తున్న మున్నేరు వాగు వేసవి కాలం రాకముందే పూర్తిగా ఎండిపోయింది. నీరు ఇంకిపోయి రాళ్లు బయటకు తేలాయి. దీంతో వేసవి వరి పంట సాగు చేసిన మున్నేరు వాగు పరీవాహక ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి నెలలోనే మున్నేరు వాగులో నీరు లేకపోవడంతో జంతువులు, పక్షుల తాగు నీటికి కష్టంగా మారింది.



చోరీ జరిగిన రాయపర్తిలోని బ్యాంకు (ఫైల్)

## దొంగలు దొరకరు.. సొత్తు రికవరీ చేయరు

పరారీలోనే కీలక నిందితులు


*రాయపర్తిలోని ఎస్‌బీఐలో చోరీ జరిగి రెండు నెలలైనా పోలీసులు కేసును ఛేదించలేకపోతున్నారు. సుమారు 19 కిలోల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లగా, 15 రోజుల్లో దొంగల ఆచూకీని తెలుసుకుని ముగ్గురిని పట్టుకుని 2.520 కిలోల నగలు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు కీలక నిందితులు పరారీలో ఉండగా, వారిని పట్టుకోవడంలో, సొత్తును రికవరీ చేయడంలో పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగల కోసం బాధితులు నిత్యం బ్యాంకు చుట్టూ తిరుగుతూ తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.* – సుబేదారి, ఫిబ్రవరి 2

- పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు
- నగల కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్న బాధితులు
- రెండు నెలలు దాటినా పురోగతి లేని రాయపర్తి బ్యాంకు దోపిడీ కేసు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రాయపర్తి ఎస్‌బీఐలో గత నవంబర్ 18 అర్ధరాత్రి అంతర్ రాష్ట్ర దొంగల ముఠా చోరీకి పాల్పడి సుమారు 19 కిలోల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. నిందితులను పట్టుకోవడానికి పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పది ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేయగా, పదిహేను రోజుల్లోనే ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్షాద్ అన్సారీ, షాకీర్‌ఖాన్, హిమాన్షును పట్టుకున్నాయి. డిసెంబర్ 6న సీపీ ముగ్గురు దొంగల అరెస్ట్, 2.520 కిలోల బంగారు ఆభరణాలు, కారు, రూ. పదివేల నగదు రికవరీ చూపించారు. తర్వాత మరొకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత ఈ కేసులో కీలకంగా ఉన్న ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. వీరిని పట్టుకోవడం పోలీసు అధికారులకు సవాల్‌గా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు మిగతా దొంగలను పట్టుకోవడానికి బయటి రాష్ట్రాలకు వెళ్లేటప్పుడు ప్రత్యేక పోలీసు బృందాలే సొంతంగా డబ్బులు సమకూర్చుకోవాల్సి ఉండడంతో అక్కడి వెళ్లడానికి వెనకడుగు వేయడానికి ఇదొక కారణమని ఓ పోలీసు అధికారి చెప్పాడు. కాగా, ఈ చోరీలో గోల్డ్‌కు సంబంధించిన బాధితుల్లో ఎక్కువ మంది బ్యాంకులో గోల్డ్ కుదువపెట్టి రుణాలు తీసుకున్నవారే ఉన్నారు. మిగతా నిందితులను అరెస్ట్ చేయకపోవడం, 90 శాతం సొత్తు రికవరీ చేయకపోవడంతో కేసు విచారణ స్థాయిలో ఉంది. ఈ క్రమంలో స్థానిక పోలీసులు చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయకపోవడంతో బాధితులకు రావాల్సిన ఇన్సూరెన్స్ క్లెయిమ్ జాప్యం జరుగుతున్నదని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

### ముగ్గురు నిందితుల వద్దే మొత్తం సొత్తు

దొంగల ముఠాలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు దొంగలతోపాటు కారు డ్రైవర్‌ను పోలీసు లు అరెస్ట్ చేశారు. ఇంకా ముగ్గురిని అరెస్ట్ చేయాల్సి ఉంది. వీరిలో ముంబైకి చెందిన ఇద్దరు, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మరో దొంగ ఉన్నాడు. వీరి వద్దనే రికవరీ కావాల్సిన మొత్తం బంగారం ఉందని చెబుతున్నారు. దోపిడీ జరిగిన రెండు నెలలు దాటినా ముగ్గురు దొంగలను పోలీసులు పట్టుకోలేకపోతున్నారు.



చేపల వేటలో జాలర్లతో పక్షులు పోటీ పడుతున్నట్లున్న ఈ దృశ్యం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గోదావరి వద్ద కనిపించింది. నదిలో వరద ప్రవాహం తక్కువ ఉన్నా ఈ పక్షులు చేపలను వేటాడడంలో ప్రత్యేకత కలిగి ఉంటాయి. గంటల తరబడి నీటిలో ఈదడం, రెండు నిమిషాలపాటు మునిగి చేపలను పట్టే సామర్థ్యం వీటి సొంతం. ఎక్కువగా నీటిలో ఉండే పక్షులు కావడంతో వీటిని నీటి బాతులుగా పిలుస్తారు. నలుపు రంగులో ఉంటూ కిలోకంటే తక్కువ బరువును కలిగి ఉంటాయి. జాలర్లు బోటులో చేపలు పడుతుండగా గోదావరి నీటిని ఆనుకొని చేపల వేటకు వెళ్తున్న సుమారు రెండు వందల పక్షులను 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది. – కన్నాయిగూడెం, ఫిబ్రవరి 2